క్లుప్తంగా

నేడు వైఎస్సార్ సీపీ జెండా ఆవిష్కరణ

బల్లికురవ: బల్లికురవ గ్రామంలోని ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాల సమీపంలో ఆదివారం సాయంత్రం మూడు గంటలకు వైఎస్సార్ సీపీ జెండా ఆవిష్కరిస్తున్నట్లు మండల ఇన్‌చార్జ్ పి బ్రహ్మారెడ్డి శనివారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. కాలనీలో నెలకొన్న సమస్యలు తెలుసుకునేందుకు రాగా పార్టీపై ఉన్న అభిమానంతో తాము సమష్టిగా జెండా ఏర్పాటు చేస్తున్నామని, ఆవిష్కరించాలని కోరారు. కార్యక్రమానికి పార్టీ అద్దంకి నియోజకవర్గ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని, అభిమానులు కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని బ్రహ్మారెడ్డి కోరారు.

చెత్తరహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలి

చీరాల టౌన్: ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరు డస్ట్‌బిన్లను వినియోగిస్తూ ఇళ్ల నుంచి వచ్చిన చెత్తను పంచాయితీ ట్రాక్టర్లకే ప్రజలు అందించాలని ఎంపీడీవో కే నేతాజీ సూచించారు. శనివారం మండలంలోని దేవాంగపురి గ్రామ పంచాయతీలో చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లోని చెత్త నుంచి సంపద తయారీ చేసేందుకు చెత్తనుంచి సంపద కేంద్రాలను ప్రారంభిస్తున్నామన్నారు. పంచాయతీల అధికారులు గ్రామాల్లోని ప్రజలకు అవగాహన కల్పించి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగించుకోవాలన్నారు. సమావేశంలో గ్రామ పంచాయతీ సెక్రటరీ, ఈవోఆర్డీ మురళీ బాపూజీ, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

31న విద్యార్థులకు పద్యపఠన పోటీలు

చీరాల అర్బన్: బత్తుల సర్వీస్ ట్రస్టు ఆధ్వర్యంలో వేమన జయంతి ఉత్సావాల్లో భాగంగా ఈనెల 31న చీరాల, పరిసర ప్రాంత హైస్కూల్ విద్యార్థులకు పద్యపఠన పోటీలను నిర్వహిస్తున్నట్లు ట్రస్టు అధ్యక్ష, కార్యదర్శులు బత్తుల బ్రహ్మారెడ్డి, వడలి రాధాకృష్ణ శనివారం తెలిపారు. చీరాల ఆర్వోబీ కింద గల సీనియర్ సిటిజన్స్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. పోటీలలో విజేతలకు నగదు ప్రోత్సాహక బహుమతులతో పాటు ప్రతి విద్యార్థికి నీతిశతక పుస్తకాలను అందిస్తామన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొనాలని వారు కోరారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవిస్తే ఆర్థిక సాయం

బల్లికురవ: ప్రభుత్వం ప్రధానమంత్రి మాతృ వందనంలో గర్భిణులకు మొదటి, రెండో కాన్పుకు ఒక్కో కాన్పుకు రూ. 5 వేలు చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నట్లు గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారులు షేక్ రమీజ్ అహమ్మద్, జీ. రవితేజ శనివారం తెలిపారు. గర్భిణులు తమ పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. ఆరోగ్యశ్రీలో వివిధ రకాల అపరేషన్లు చేయించుకున్న వారికి ప్రభుత్వం ఆరోగ్య ఆసరాలో సర్జరీ అయిన రోజుకు రూ.200 చొప్పన కోలుకునేవరకు రోగి బ్యాంకు ఖాతాకు జమచేస్తున్నట్లు చెప్పారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కాన్పుల తోపాటు అన్ని రకాల ల్యాబ్ టెస్టులు చేస్తున్నామని, ఈ అవకాశాన్ని మండల ప్రజలు వినియోగించుకోవాలని వైద్యాధికారులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యలపై ప్రత్యేక చర్యలు

అద్దంకి రూరల్: అద్దంకి పట్టణంలోని ట్రాఫిక్ సమస్యపై ప్రత్యేక చర్యలు చేపట్ట నున్నట్లు సీఐ పీ. కృష్ణయ్య తెలిపారు. శనివారం రాత్రి నిర్వహించిన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పట్టణంలో నామ్ రహదారి వెంటనున్న ఆక్రమణలు తొలగించి, పండ్లు, చిరువ్యాపారులను రోడ్డు మీదకు రాకుండా చర్యలు తీసుకుంటానన్నారు. మున్సిపల్ అధికారులతో సంప్రదించి స్థానిక భవాని సెంటర్‌లో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు పాటు ట్రాఫిక్ పోలీసులను నియమించనున్నట్లు తెలిపారు. ప్రమాదాల నివారణకు ప్రజలు సహకరించాలని కోరారు.

30న చీరాల జాబ్ మేళా

చీరాల అర్బన్: పట్టణంలోని వైఏ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో ఈనెల 30న జవహర్ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సీహెచ్ రమణమ్మ శనివారం తెలిపారు. శ్రీసిటిలోని తడకు చెందిన నియోలింక్ కంపెనీలో సెల్‌ఫోన్స్ అసెంబ్లెర్లు, క్వాలిటీ చెకర్ పోస్టులకు ఉద్యోగ మేళా జరుగుతుందన్నారు. 18–35 సంవత్సరాల్లోపు మహిళలకు మాత్రమే ఉద్యోగావకాశాలు అందిస్తున్నట్లు తెలిపారు. పదోతరగతి, ఇంటర్ పాస్, ఫెయిల్ అయిన అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న వారు పదోతరగతి, ఇంటర్ ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్, పాస్‌పోర్టుసైజు ఫొటోలతో ఈనెల 30న ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలకు హాజరుకావాలన్నారు. పూర్తి వివరాలకు కళాశాలలోని జవహర్ విజ్ఞాన కేంద్రంలో సంప్రదించాలన్నారు.

ఉపాధి పనులకు మేట్ల ఎంపిక

బల్లికురవ: ప్రభుత్వం వలసలను నిరోధించేందుకు ప్రవేశపెట్టిన ఉపాధి హామీ పథకంలో గ్రామాల వారీగా కూలీలకు పనులు కల్పించేందుకు మేట్లను ఎంపిక చేస్తున్నట్లు ఎంపీడీవో ఎల్ బ్రహ్మాయ్య, ఏపీవో బాలకృష్ణ నాయక్ శనివారం తెలిపారు. ఎక్కువ మంది కూలీలకు పనులు కల్పించాలన్న ధ్యేయంతోపాటు పని ప్రదేశం నుంచే కూలీల హాజరు ఫోటోలు పంపేందుకు మేట్ల ఎంపిక చేపట్టినట్లు చెప్పారు.


ప్రశంస పత్రం అందుకుంటున్న చినగంజాం పీహెచ్‌సీ వైద్యుడు విజయభాస్కర్


ప్రశంస పత్రం అందుకుంటున్న సంతరావూరు పీహెచ్‌సీ వైద్యురాలు కీర్తి సరోజ్


ఎస్పీ, కలెక్టర్ నుంచి అవార్డు స్వీకరిస్తున్న నాగేశ్వరరావు


ఎస్పీ నుంచి ప్రశంస పత్రం అందుకుంటున్న రేణింగవరం ఎస్సై తిరుపతిరావు

ఉత్తమ సేవలకు ప్రశంసలు, పురస్కారాలు


కలెక్టరు నుంచి పురస్కారం అందుకుంటున్న ఉద్యాన శాఖాధికారి హనుమంతు నాయక్


కలెక్టరు నుంచి పురస్కారం అందుకుంటున్న యద్దనపూడి ఏపీవో రమేష్‌బాబు

- జిల్లా కేంద్రంలో పురస్కారాలు అందుకున్న ఉద్యోగులు
- ఆనందం వ్యక్తం చేసిన కుటుంబ సభ్యులు

చినగంజాం: పౌర సేవలు అందించడానికి అటు ప్రభుత్వానికి ఇటు ప్రజలకు మధ్య వారధిగా ఉన్న ఉద్యోగులు ఎంతో కీలకం. విధి నిర్వహణలో తమకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకొని ప్రజల నుంచి ప్రభుత్వాన్ని నుంచి ప్రశంసలు అందుకున్నారు.

చినగంజాం మండలంలో ఇరువురు ప్రభుత్వ వైద్యులు గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవా పురస్కారాలు అందుకున్నారు. మండలంలోని చినగంజాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎస్ విజయభాస్కర్, సంతరావూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి కే కీర్తి సరోజ్‌లు శుక్రవారం బాపట్ల కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన గణతంత్ర దిన వేడుకల్లో పురస్కారం అందుకున్నారు. జిల్లా కలెక్టర్ పీ రంజిత్‌బాషా, జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి చేతుల మీదుగా పురస్కారం, ప్రశంస పత్రాలు అందుకున్నారు. వీరితో పాటు 104 సిబ్బంది పాదిలి రాఘవ సేవా పురస్కారం అందుకున్నారు. కార్యక్రమంలో డీఎంఅండ్ హెచ్‌ఓ విజయలక్ష్మి పాల్గొన్నారు. వైద్యాధికారులకు ఉత్తమ పురస్కారం అందుకోవడంపై వైద్యులు పీ సాయి శ్రీచరణ్, సీహెచ్ఓ ఝాన్సీరాణి, పీహెచ్ఎన్ బేబి, సూపర్‌వైజర్ చిరంజీవి, ఉల్దారాణి, ఎల్‌టీ శ్యాం సుందర్, మురళి, మహేష్ రెండు ఆరోగ్య కేంద్రాల ఆసుపత్రి సిబ్బంది అభినందనలు తెలిపారు.


ప్రకాశం జిల్లా కలెక్టర్ నుంచి ప్రశంస పత్రం అందుకుంటున్న లైబ్రేరియన్ నరసింహాచార్యులు

లైబ్రేరియన్‌కు పురస్కారం..

ఉత్తమ గ్రంథపాలకుడిగా చినగంజాం శాఖా గ్రంథాలయ లైబ్రేరియన్ అశోహరి మోహన లక్ష్మీ నరసింహాచార్యులు రెండోసారి పురస్కారం అందుకున్నారు. శుక్రవారం రిపబ్లిక్ డే పురస్కరించుకొని ప్రకాశం జిల్లా కేంద్రం ఒంగోలులో నిర్వహించిన వేడుకలలో జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ చేతుల మీదుగా పురస్కారం ఆయన అందుకున్నారు. గ్రంథాలయ చైర్‌పర్సన్ రాచగొర్ల వెంకట సుశీల, పిచ్చయ్య యాదవ్‌లు అభినందనలు తెలియజేశారు. గ్రంథాలయ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి చిన గంజాం గ్రంథాలయంలో కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తూ గ్రంథాలయ అభివృద్ధికి సేవలందించినందుకుగాను ప్రశంస పత్రం అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక మండల అధ్యక్షుడు ఎస్ నరసింహారావు, రిటైర్డ్ ఈఈ కుర్రి రామసుబ్బారావు, రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ పీ కాంతారావులు అభినందనలు తెలిపారు.



ఉత్తమ ఏపీఎంగా పీడీ నుంచి అవార్డు అందుకున్న చీరాల ఏపీఎం సుబ్బారావు

రిపబ్లిక్ వేడుకల సందర్భంగా మార్టూరుకు చెందిన అధికారులు పలువురు ఉత్తమ సేవా అవార్డులు అందుకున్నారు. ఉత్తమ ఉద్యానవన శాఖా అధికారిగా బి. హనుమంతు నాయక్, ఉత్తయ వ్యవసాయ అధికారిగా వీరగంధం కిరణ్ కుమార్‌లు కలెక్టరు చేతుల మీదుగా పురస్కారాలు అందుకున్నారు. వీరితో పాటు మార్టూరు పోలీస్ స్టేషన్‌కు చెందిన ఏఎస్ఐ షేక్‌మస్తాన్ షరీఫ్, సాయిరాం లతో పాటు బబ్బేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన బత్తుల వెన్నెల జొన్నతాళి యూపీ స్కూల్‌కు చెందిర రాజాచారి పురస్కారాలు అందుకున్నారు.

ఉత్తమ ఎస్సైగా కేకే తిరుపతిరావు

జే.పంగులూరు: మండలంలోని రేణింగవరం స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న కేకే తిరుపతిరావుకు గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవా అవార్డు వచ్చింది. జిల్లా పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో కలెక్టర్, ఎస్పీ చేతుల మీదుగా ప్రశంస పత్రం అందుకున్నారు. మండలంలో ఎంపీడీవో రామాంజినేయులు, ఆర్ఐ రామకృష్ణ, ఏపీఎం జ్యోతి ప్రసాద్‌బాబుకు ఉత్తమ సేవా అవార్డులు అందుకున్నారు.

ఉత్తమ సేవలకు అత్యుత్తమ పురస్కారాలు అందజేత

చీరాల టౌన్: ప్రభుత్వ సేవలను సత్వరంగా ప్రజలకు అందించడంతో పాటుగా ప్రభుత్వ లక్ష్యాలను ప్రజలకు చేరువ చేయడంలో విశేష ప్రతిభ చూపిన పలుశాఖల అధికారులకు ఉత్తమ అధికారి అవార్డులు అందించి సత్కరించారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన 75వ గణతంత్ర దిన వేడుకల్లో చీరాల తూనికలు, కొలతలశాఖ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న కె.నాగేశ్వరరావు, మండల వైఎస్సార్ కాంతిపథం ఏపీఎం జి.సుబ్బారావు, సీసీ అనురాధా, వీవోఏ లీలాకుమారిలకు ఉత్తమ అవార్డులు అందాయి. చీరాల రీసర్వే డీటీ దేవతోటి అర్జున్‌లకు ఉత్తమ అధికారి అవార్డును ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, ఆర్డీవో సరోజినిలు అందించారు. అలానే మండల హౌసింగ్ ఏఈ బి.శ్రీనివాసరావుకు ఉత్తమ ఏఈ అవార్డును హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ చేతుల మీదుగా అవార్డులను అందుకున్నారు. ఉత్తమ అవార్డు అందుకున్న పలుశాఖల అధికారులు, ఉద్యోగులకు తోటి ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

విద్యార్థి దశ నుంచే పొదుపు అవసరం


బ్యాంకు పాస్ పుస్తకాలతో విద్యార్థులు ఉపాధ్యాయులు

వేటపాలెం: విద్యార్థులు చదువుకొనే దశ నుంచే పొదుపు అలవర్చుకోవాలని వేటపాలెం స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా మేనేజర్ విజయకుమార్ సూచించారు. అక్కాయిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో 90 మంది విద్యార్థులకు జీరో బ్యాలన్స్‌తో ఎస్‌బీఐ అకౌంట్ పాస్ పుస్తకాలు మేనేజర్ శనివారం అందజేశారు. ఈసందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ చిన్నతనం నుంచే పొదుపు చేయడం , బ్యాంకు లావాదేవీల నిర్వహణ అలవాటు చేసుకోవాలని తెలిపారు. హెచ్ఎం భవనం భద్రిరెడ్డి మాట్లాడుతూ చదువుకొనే విద్యార్థి దశ నుంచే బ్యాంకులో ఖాతా బుక్ ఏర్పాటు చేయడం మంచి అవకాశమన్నారు. ఇటువంటి కార్యక్రమం ఉపాధ్యాయుల సహకారంతో చేశామన్నారు. అందుకు బ్యాంకు అధికారులు సహకారం అందించారన్నారు. విద్యార్థులు ప్రతి పనిని కూడా కష్టంతో కాకుండా ఇష్టంతో, సంస్కారంతో కూడిన విద్య నేర్చుకుంటే ఉన్నత స్థితికి ఎదుగుతారని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, జయరావు, శ్రీనివాసరెడ్డి, అనూరాధ, అంజమ్మ, బాలసుబ్రమణ్యం, కమురున్నీసాబేగం పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

యద్దనపూడి: గ్రామాల్లో పారిశుద్ధంపై ప్రత్యేక దృష్టి సారించాలని, అందుకు కార్యదర్శులు కృషి చేయాలని ఎంపీడీవో కృష్ణకుమారి సూచించారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సెర్ప్ సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్య నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలపై పంచాయతీ కార్యదర్శులకు, ఆయా గ్రామాల సర్పంచ్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సెర్ప్ సంస్థ కోఆర్డినేటర్ సీహెచ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని , గ్రామాల్లో తడి,పొడి చెత్తను వేరువేరుగా సేకరించి దాని ద్వారా కంపోస్ట్ ఎరువుకి ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ శ్రీనివాసరావు, సెర్ప్ సంస్థ ట్రైనర్ ప్రదీప్, ఏపీఓ రమేష్‌బాబు సచివాలయ సిబ్బంది, పారిశుద్ధ్య సంఘ సభ్యులు, వలంటీర్లు, పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు

విజేతలకు నగదు బహుమతులు అందజేత

చినగంజాం: రిపబ్లిక్ డేను పురస్కరించుకొని చినగంజాం బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండలస్థాయి షటిల్ టోర్నమెంట్ పోటీలు శనివారం వేకువ జామున ముగిశాయి. టోర్నమెంట్‌లో చినగంజాం, ఇంకొల్లు, మార్టూరు, వేటపాలెం, నాగులుప్పలపాడు, ఒంగోలు నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. ఈనెల 25వ తేదీ స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఔట్‌డోర్‌లో ప్రారంభించిన టోర్నమెంట్‌లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీలలో మొదటి బహుమతి చినగంజాంకు చెందిన అనిల్ అండ్ రాజేష్ గెలుచుకోగా రైల్వే సీఐ ఉల్చి దుర్గాప్రసాద్ రూ.8 వేలు, రెండో బహుమతి ఒంగోలుకు చెందిన భరత్ అండ్ సందీప్ గెలుచుకోగా ఆర్ఎంపీ వైద్యులు కే సుబ్బారావు రూ.6 వేలు, మూడో బహుమతి చీరాలకు చెందిన రత్న అండ్ జితేంద్రలు గెలుచుకోగా రిటైర్డ్ పీడీ కుంచాల వెంకట శేషగిరిరావు రూ.5 వేలు, నాలుగో బహుమతి చినగంజాంకు చెందిన మున్నా అండ్ రాహుల్ గెలుచుకోగా షాహిద్ బ్రదర్స్ రూ.4 వేలు, ఐదో బహుమతి చినగంజాంకు చెందిన మౌలాలి అండ్ రహీం గెలుచుకోగా సిద్ధం సాయి పవన్ జ్ఞాపకార్థం రూ.3 వేలు, ఆరో బహుమతి వేటపాలేనికి చెందిన భాను అండ్ సూర్య గెలుచుకోగా కుక్కల వెంకటేశ్వర్లు రూ.2 వేలు బహుమతులు అందజేశారు. టోర్నమెంట్‌ను చినగంజాం బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షులు వలివేటి వెంకటరామానుజం ఆధ్వర్యంలో మున్నా, నబీ షా, అమీర్ జాన్, వంశీ, వినయ్, మౌలాలి, రాజేష్ తదితరులు నిర్వహించారు.


విజేతలకు బహుమతులందిస్తున్న నిర్వాహకులు

చిరంజీవి చిత్రపటానికి క్షీరాభిషేకం

పర్చూరు (చినగంజాం): సినీ నటుడు చిరంజీవి చిత్రపటానికి అభిమానులు క్షీరాభిషేకం చేశారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం చిరంజీవికి పద్మవిభూషణ్ బిరుదుతో సత్కరించిన విషయం తెలిసిందే. ఈసందర్భాన్ని పురస్కరించుకొని శనివారం అభిమానులు స్థానిక బొమ్మల సెంటర్‌లో కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. కార్యక్రమంలో కోట హరిప్రసాద్, ఆలా అనిల్ కుమార్, కఠారి సురేంద్ర, గాజుల రమేష్, కోట శ్రీనివాసరావు, రంగిశెట్టి రవి, హరిదాసుల మాధవరావు తదితరులు పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న చిరంజీవి అభిమానులు

విద్యుత్ సమస్యలపై ప్రజాభిప్రాయ సేకరణ

అద్దంకి రూరల్: విద్యుత్ సమస్యలపై ఈనెల 29 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు అద్దంకిలోని విద్యుత్ భవన్‌లో నిర్వహించనున్న బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణను అద్దంకి డివిజన్ పరిధిలోని ప్రజలు వినియోగించుకోవాలని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నల్లూరి మస్తాన్‌రావు శనివారం ఒక ప్రకటనలో కోరారు. శింగరకొండ రోడ్‌లోని అద్దంకి విద్యుత్ భవన్‌లో 2024–25 నుంచి 2028–29 వరకు పంపిణీ, సరఫరా, ఎస్ఎల్‌డీసీ వ్యాపారానికి సమగ్ర ఆదాయ వనరులపై కాన్ఫరెన్స్ ద్వారా బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా తెలిపే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

చీరాలలో..

చీరాల అర్బన్: విద్యుత్ శాఖ డివిజన్ కార్యాలయంలో ఏపీసీపీడీసీఎల్ ఆధ్వర్యంలో ఈనెల 29,30,31 తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.జాన్ థామస్ శనివారం తెలిపారు. ఏపీసీపీడీసీఎల్, ఏపీఈపీడీసీఎల్, ఏపీఎస్‌పీడీసీఎల్, ఏపీ ట్రాన్స్‌కో, ఏపీ జెన్‌కో 2024–25 ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదించిన వార్షిక ఆదాయ అవసరాలు, రిటైల్ ధరలపై విద్యుత్ వినియోగదారుల నుంచి ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలి

బల్లికురవ: రబీలో వివిధ పంటలు సాగుచేసిన రైతులంతా ఫిబ్రవరి 10వ తేదీలోపు ఈ–క్రాప్ నమోదుతో ఈ-కేవైసీ చేయించుకోవాలని వ్యవసాయాధికారిణి ఎస్‌పీపి కుమారి శనివారం తెలిపారు. ఈ–క్రాప్ నమోదుతో పంట ఉత్పత్తులను అమ్ముకోవటంతో పాటు, విపత్కర పరిస్థితుల్లో పరిహారం పొందవచ్చన్నారు. ఖరీఫ్‌లో సాగుచేసిన పత్తి, మిర్చి, వరి, మొక్కజొన్న, పొగాకు తదితర పంటలకు ఇటీవల సంబంధించిన మిచాంగ్ తుఫాన్‌కు 1825 మంది రైతులకు 1009 హెక్టార్లలో 2.37 కోట్లు నష్టం వాటిల్లగా ఉన్నతస్థాయి అధికారులకు నివేదించినట్లు చెప్పారు. ఆర్‌బీకేల ద్వారా రైతులకు అవసరమైన ఎరువులను అందిస్తున్నామని కుమారి వివరించారు.

క్రీడలతో స్నేహబంధాలు పెంపు


పోటీలను తిలకిస్తున్న సమన్వయకర్త వెంకటేష్

- వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం
- ప్రారంభించిన వైఎస్సార్ సీపీ సమన్వయకర్త కరణం

చీరాల టౌన్: గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా పోటీలను నిర్వహించడం వలన క్రీడాకారుల మధ్యస్నేహ బాంధవ్యాలతో పాటుగా యువతలో క్రీడాస్ఫూర్తి పెంపొందుతుందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కరణం వెంకటేష్ అన్నారు. శనివారం మండలంలోని గవినివారిపాలెం గ్రామంలో వాలీబాల్ ఓపెన్ టోర్నమెంట్‌ను వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి కరణం ప్రారంభోత్సవం చేశారు. ముందుగా క్రీడాకారులను పరిచయం చేసుకుని ఆటల్లో చక్కని ప్రతిభ చూపి రాణించాలన్నారు. ఈసందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే ఆటల పోటీలతో గ్రామాల్లోని ప్రజలు, క్రీడాకారుల మధ్య స్నేహబంధాలు పెరుగుతాయన్నారు. క్రీడల్లో రాణించడం వలన శారీరక దృఢత్వం పెరగడంతో పాటుగా ఏకాగ్రత, నాయకత్వ లక్షణాలు పెరుగుతాయన్నారు. క్రీడల్లో రాణించడం వలన ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాల్లో కోటా లభిస్తుందన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలో క్రీడారంగానికి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు ఆడుదాం ఆంధ్రా పోటీలను విజయవంతంగా నిర్వహిస్తూ క్రీడలకు చదువుతో పాటుగా సమానంగా క్రీడాభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. క్రీడా పోటీల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించినప్పుడే ఆటలతో పాటుగా జీవితంలో కూడా రాణిస్తారన్నారు. ఓటమిని విజయానికి తొలిమెట్టుగా స్వీకరించాలన్నారు. వాలీబాల్ పోటీలను నిర్వహిస్తున్న కమిటీని అభినందించారు. పోటీలు రసవత్తరంగా జరుగుతున్నాయి. కార్యక్రమంలో ఈపురుపాలెం ఎస్సై పీ జనార్దన్, కార్పొరేషన్ డైరెక్టర్ జి.శ్రీనివాసరావు, రత్నారెడ్డి, సుబ్బయ్య, రామకృష్ణ, సాంబయ్య, క్రీడాకారులు, గ్రామపెద్దలు, యువకులు పాల్గొన్నారు.

ప్రముఖులకు వృత్తి సేవా పురస్కారాలు

పర్చూరు (చినగంజాం): గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానికంగా ఉన్న ప్రముఖులకు వృత్తి సేవా పురస్కారాలు అందించినట్లు పర్చూరు రోటరీ క్లబ్ అధ్యక్షుడు నాగభైరు శ్రీనివాసరావు తెలిపారు. శనివారం స్థానిక రోటరీ భవనంలో వివిధ వృత్తుల్లో మెరుగైన సేవలందిస్తున్న విశిష్ట వ్యక్తులను గుర్తించి వారిని ఘనంగా సన్మానించారు. సన్మానించిన వారిలో బధిరుల పాఠశాల వ్యవస్థాపకుడు నాగుబడి సుబ్బారావు, డిప్యూటీ కలెక్టర్ కఠారి రమేష్ నాయుడు, పర్చూరు కెనరా బ్యాంక్ మేనేజర్ మద్దెల చెన్నకేశవులు, పర్చూరు పోస్టుమాస్టర్ కోడూరి వీర బ్రహ్మాచారి, పర్చూరు పంచాయతీ నీటి సరఫరా టెక్నీషియన్ కే మహేంద్ర, నూతలపాడు ఆశ వర్కర్ మందాటి రాధలను సత్కరించారు. కార్యక్రమంలో రోటరీ మాజీ గవర్నర్ అన్నె రత్న ప్రభాకర్, లంకా రఘురామిరెడ్డి, రోటరీ క్లబ్ కార్యదర్శి పంబి సదానందరెడ్డి, న్యాయవాది రావి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


బ్యాంక్ మేనేజర్‌ను సన్మానిస్తున్న రోటరీ సభ్యులు

అమ్మవారికి విశేష పూజలు

చీరాల అర్బన్: పట్టణంలోని లలితా సేవా సమాజం గీతామందిరం 32వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం విశేష పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం 108 మంది మహిళలచే వేయి కిలోల పసుపు, 108 కిలోల కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఏటా వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం తీర్థ ప్రసాదాలను భక్తులకు అందించారు.


అమ్మవారికి పసుపు, కుంకుమలతో పూజ నిర్వహిస్తున్న మహిళలు

నేడు కారంచేటి వంశీయుల ఆత్మీయ సమ్మేళనం

పర్చూరు (చినగంజాం): కారంచేటి వంశీయుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఉదయం 8 గంటలకు స్థానిక అద్దంకి నాంచారమ్మ కళ్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు కారంచేటి శ్యాంసుందరప్రసాద్, సుబ్బారావు, కుమార్, శివరామకృష్ణ, శ్రీనివాసులు, మల్లికార్జునశర్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఉదయం 8 గంటలకు పార్వతి సమేత భీమేశ్వరస్వామి దేవస్థానం నందు పూజా కార్యక్రమాలు, 10 గంటలకు అద్దంకి నాంచారమ్మ దేవస్థానంలో శాంతి కళ్యాణం, 12 గంటలకు కారంచేటి వంశ వృక్షం వంశీయుల పరిచయ కార్యక్రమం జరుగుతుందన్నారు. కారంచేటి వంశీయులు ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.